## సంపాదకీయం

**ఆదివారం 15-09-2024**

# సంక్షేమంపై ప్రయి'వేటు'!

అద్దాల మేడల నిర్మాణంలో రాళ్లెత్తే కూలీలు వారు. రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు జీవులు. అడ్డాలపై నిలబడి పనికోసం పడిగాపులు పడుతుంటారు. ఎన్నో పోరాటాల ఫలితంగా కొన్ని హక్కులు, సంక్షేమ పథకాలు సాధించుకున్నారు. ఇప్పుడు ఆ పథకాల నుండి ప్రభుత్వం తప్పుకోజూస్తున్నది. ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నిస్తోంది. దీని కోసం టెండర్లను కూడా ఆహ్వానించింది. దీంతో భవన నిర్మాణ కార్మికులకు ఇబ్బందులు ఎదురుకానున్నాయి.భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో 2009లో వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేశారు. దీని ఆధ్వర్యంలో 11 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులోని ప్రమాద మరణం, సహజ మరణం, పాక్షిక, శాశ్వత అంగవైకల్యానికి సంబంధించిన పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటూ ఆగస్టు 21వ తేదీన ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ఆధీనంలో నడుస్తున్న ఈ పథకాలను ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగించడం వల్ల వచ్చే ఆ కాస్త ప్రయోజనాలు కూడా అందకుండా పోతాయేమోనని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. వీరి వేదనలో నిజం లేకపోలేదు. ప్రభుత్వ ఆధీనంలో ఉంటేనే అనేక తప్పులు చూపి, సాకులు వెదికి కార్మికులకు రావల్సిన నష్టపరిహారం అందకుండా చేస్తున్నారు. ఇక (ప్రయివేటు) ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తే సమస్య ఎంత జఠిలమవుతుందో ప్రత్యేకంగా చెప్పక్కరలేదు.ఇందులో అనేక తిరకాసులు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లు నమోదు చేసుకున్న కార్మికులు 25,71,880. వీరంతా ప్రతి ఐదేండ్లకు ఓసారి రెన్యువల్ చేయించుకోవల్సి వుంటుంది. అనేక సమస్యలతో ప్రస్తుతం 15,10,330 మంది మాత్రమే రెన్యువల్ చేయించుకున్నారు. ప్రభుత్వం వీరిని మాత్రమే కార్మికులుగా గుర్తిస్తోంది. మిగిలిన వారిని ఈ స్కీమ్ పరిధిలో చూపించడం లేదు. మరో విషయం గిగ్ వర్కర్స్(ఆన్‌లైన్ కార్మికులు)ను కూడా ఇందులో కలుపుతామంటున్నారు. అయితే వీళ్లకు ప్రీమియం ఎవరు కడతారనే దాంట్లో స్పష్టత లేదు.నిబంధనల ప్రకారం పది లక్షల రూపాయలకు మించి కట్టే ప్రతి భవనానికి ఆ యజమాని పర్మిషన్ల సమ యంలో ప్రభుత్వానికి ఒక శాతం చెల్లించాలి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇలా రూ.5,700 కోట్లు బోర్డులో జమయ్యాయి. ఇందులో రూ.4,262 కోట్లు మాత్రమే కార్మికుల సంక్షేమానికి అందాయి. మిగిలిన మొత్తం గత ప్రభుత్వ హయాంలో ఎవరి ఇష్టం వచ్చినట్టు వాళ్లు ఖర్చు చేసుకున్నారు. చట్టం ప్రకారం ఒక శాఖకు చెందిన నిధులను మరో శాఖకు మళ్లించే హక్కు ప్రభుత్వానికే లేదు. అయినా న్యాయంగా కార్మికులకు అందాల్సిన నిధులను అధికారులు దారి మళ్లించారు. వాస్తవానికి 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డుకు కార్మిక సంఘ నాయకులతో ఓ అడ్వయిజరీ కమిటీ నియమించాలి. నిధులు ఖర్చు పెట్టాలన్నా, మార్పులేమైనా చేయాలన్నా ఈ కమిటీ నిర్ణయించాలి. అలాంటి కమిటీ మన రాష్ట్రంలో అసలు లేకపోవడమే ఈ సమస్యలకు ప్రధాన కారణం. మరో ముఖ్యమైన విషయం ఈ పదేండ్లలో రాష్ట్రంలో కేవలం 5639 మంది మర ణం ద్వారా, 627 మంది అంగవైకల్యం ద్వారా ఈ పథకాల నుండి ప్రయో జనం పొందారు. కానీ ప్రీమియం మాత్రం ప్రభుత్వం ప్రతి ఏడాది అందరికీ చెల్లిస్తుంది. దాంతో పెద్ద మొత్తంలో అందులో డబ్బు జమవుతుంది. వడ్డీ కూడా బాగానే వస్తుంది. ఇదంతా ప్రస్తుతం వెల్ఫేర్ బోర్డ్ ఆధ్వర్యంలో ఉంది. అయితే ఐఆర్‌డీఏ పరిధిలోని ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామని అంటున్నారు. అందులో ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రయివేటు కంపెనీలు కూడా ఉ న్నాయి. ఏ కంపెనీలకు అప్పగిస్తారనేదాంట్లో స్పష్టత లేదు. ఒకవేళ ప్రయివేటు వారికి అప్పగిస్తే కార్మికుల నిధిని ఇన్సురెన్స్ కంపెనీలు స్వాహా చేసే ప్రమాదముంది.ఒకపక్క అడ్డాల్లో మౌలిక సదుపాయాలు లేక కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేరళ, పంజాబ్, ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రాలు 60 ఏండ్లు దాటిన కార్మికులకు పెన్షన్లు ఇస్తున్నాయి. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం ఇలాంటివేవీ అమలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా కార్మిక సంక్షేమ పథకాలను సరిగ్గా అమలు చేస్తుందనుకుంటే ముఖ్యమైన స్కీంలను హడావుడిగా ఇన్సురెన్స్ కంపెనీలకు అప్పగిస్తామంటున్నది. అందుకే కార్మికులు ఆందోళన చెందుతున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిపై పునరాలోచించాలి. కార్మిక సంఘాలతో చర్చలు జరపాలి. ఎట్టిపరిస్థితుల్లో కార్మిక సంక్షేమ పథకాలను ప్రభుత్వమే అమలు చేయాలి. ఒకవేళ అప్ప గించాల్సి వస్తే ఎల్ఐసీ వంటి ప్రభుత్వ కంపెనీలకు మాత్రమే అప్పగించాలి. అప్పుడే కార్మికులకు మేలు జరుగుతుంది. అలాగే వెంటనే వెల్ఫేర్ బోర్డ్ అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేయాలి. ఇది సర్కారు బాధ్యత.

# ఆ ఇద్దరిదీ ఒకే తరహా రాజకీయం !



హైదరాబాద్,రెండు తెలుగు రాష్ట్రాల్లో విపక్ష రాజకీయ పార్టీల విన్యాసాలు చూస్తుంటే అసహ్యం కలగక మానదు. వీరు గతంలో ఎలా పాలించారో ఇప్పటికే ప్రజలకు అర్థం అయ్యింది. అప్పులు చేసి, రాజభోగం అనుభవించి, రాష్ట్రాలను దివాళా తీయించారు. భూములను ఆక్రమించి, వరదలకు కారణమయ్యారు. బలవంతంగా భూములను లాక్కున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒక్కటేమిటి..అనేక అవలక్షణాలు కనిపిస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో జగన్, కెసిఆర్ పాలనలు ఒకే తరహాలు నియంతల్లాగా సాగాయి. ప్రజలను పురుగుల్లాగా చూశారు. ప్యాలెస్‌లు వీడి ప్రజల్లోకి రాలేదు. ఇప్పటికీ ప్యాలెస్‌లు వీడి ప్రజల్లోకి రావడం లేదు.మరో నాలుగేళ్లు ఆగితే ..ప్రజలే మళ్లీ దిక్కులేక ఓట్లేస్తారన్న ధీమాలో ఉన్నారు. అందుకు ఇప్పుడున్న ప్రభుత్వాలపై బురదజల్లే పని ఉధృతంగా సాగించాలన్న ధోరణిలో ఉన్నారు. అందుకే ఇప్పుడు బురద రాజకీయాల్లో అటు వైకాపా, ఇక్కడ బిఆర్ఎస్ ఆరితేరింది. బురదలో ప్రజలను ఆదుకోవాలన్న సోయి లేకుండా చేస్తున్న విమర్శలు సిగ్గుచేటు కాక మరోటి కాదు. తమకు తప్ప ముఖ్యమంత్రి పదవిలో కొనసాగే అర్హత మరెవరికీ లేదన్న భావనలో అటు జగన్, ఇటు కెసిఆర్ ఉన్నారు. తామే మంచి పాలకులమని, వదరలకు ఇప్పుడున్న ప్రభుత్వాలదే బాధ్యతని గగ్గోలు పెడుతున్నారు. ప్రజలంతా ఇప్పుడు మళ్లీ కెసిఆర్ రావాలని, జగన్ కావాలని గగ్గోలు పెడుతున్నారని బాకా పత్రికల్లో రాసుకుంటున్నారు. ఇలా వారికి వారే నమ్ముతున్న ఈ ఇద్దరు నేతలు ప్రజలను కూడా నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఇద్దరు నేతలు అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా అభివృద్ధి జరుగుతున్నట్టుగానూ, ప్రజలు సుఖశాంతు లతో జీవిస్తున్నట్లు గానూ ప్రచారం చేసుకున్నారు. బాకా పత్రికలు ఆహో ఓహో అన్నట్లు రాస్తూ వచ్చాయి. అలాంటి రాష్ట్రాల్లో ఇప్పుడు అంతా అధ్వాన్నంగా అయినట్టుగా కనిపిస్తోందని కూడా ప్రచారం చేసుకుంటున్నారు. వారి మీడియా ప్రచారం చేసే కథనాలను అనుచరగణం ప్రచారంలో ముందుకు తీసుకుని పోతోంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయాలు ఇవే. తెలంగాణలో ఇద్దరు కెసిఆర్ కుటుంబ సభ్యులు రోజూ డజన్ల కొద్దీ ఆరోపణలు చేస్తున్నారు. ఏదైనా మంచి జరిగిందని చెప్పరు. చెరువుల ఆక్రమణలు తొలగించినా గగ్గోలు పెడుతున్నారు. వారికాలంలో మల్లన్న సాగర్ కింద రైతులు భూములు కోల్పోయి రోడ్డున పడితే పోలీసుల లాఠీలకు పనిచెప్పించారు. కోర్టుల చుట్టూ తిప్పించారు. జైలుపాలు చేశారు. బలతవంతంగా భూములను లాక్కుని వారి అడుక్కుతినేలా చేశారు. ఇలాంటి సుద్దపూసలు ప్రజల గురించి కన్నీరు కారుస్తున్నారు. ఇక ఎపిలో కూడా సిఎం చంద్రబాబుకు పనీపాటా లేదన్నట్టుగా, అందుకే వరద ప్రాంతాల్లో తిరుగుతున్నాడని జగన్ భావిస్తున్నారు. పరిపాలన చేయడం తనకు తప్ప మరెవరికీ చేతకాదని జగన్ నమ్ముతున్నారు. కెసిఆర్ కుటుంబ సభ్యులు కూడా అలాగే అంటున్నారు. కెసిఆర్ తరఫున కెటిఆర్, హరీష్ రోజూ గొంతు చించుకుంటున్నారు. జగన్‌కు మాత్రం ఆయనే గొంతు చించుకోవాల్సి వస్తోంది. వరదల్లో ప్రజలను ఆదుకునేందుకు తెలుగు రాష్ట్రాల్లో సిఎంలు గట్టిగానే కృషి చేస్తున్నారు. ఓ రకంగా చంద్రబాబు అందరిని మించి ప్రజల బాధలను పంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన వైకాపా, బిఆర్ఎస్ నేతలు ఆత్మవంచన చేసుకుంటున్నారు. వరద ప్రాంతంలో కొద్దిసేపు పర్యటించినప్పుడు, ఇప్పుడు ముఖ్యమంత్రిగా నువ్వుంటే బాగుండేదని ప్రజలు నినాదాలు చేసినట్టుగా జగన్ ప్రచారం చేసుకుంటున్నారు. వరదలొస్తే రాజధాని అమరావతి మునిగి పోతుందని అధికారంలో ఉన్నప్పుడు తాను చేసిన ప్రచారం నిజమని మళ్లీ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని మునిగిపోయి ఉంటే బాగుండన్న భావనలో ఉన్నారు. నిత్యం తాము చెప్పే అబద్దాలను కొందరైనా నమ్మకపోతారా అన్నది ఈ రెండు పార్టీల నేతల భావనగా ఉంది. అందుకే రెండు రాష్ట్రాల్లో ఒకే తరహా ప్రచారం సాగుతోంది. అధికారంలో ఉన్నప్పుడు కూడా వీరి పాలన ఒకే తరహాలో అంటే నిరంకుశం గా సాగింది. తాము దివి నుంచి దిగివచ్చిన నేతలుగా ప్రచారం చేసుకున్న తెలుగు వల్లభులు ఇప్పుడు అదే కోమాలో ఉన్నారు. గతంలో అలా నమ్మడం వల్లనే ప్రజలు ఆ ఇద్దరు నేతలకు అధికారం కట్టబెట్టారు. అందుకే ఇప్పుడు కూడా అబద్దాలు ప్రచారం చేస్తే ప్రజలను నమ్మించవచ్చని చూస్తున్నారు. అందుకే అబద్దాలకు పదును పెడుతున్నారు. రోజూ అబద్దాల ప్రచారంలో పోటీ పడుతున్నారు. తెలంగాణలో అయితే గత పాపాలపై ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం చెప్పడం లేదు. అబద్దాలను ముందేసుకుని ప్రచారం చేస్తున్నారు. అసత్య ప్రచారం ఎంతో కొంత ప్రజల్లోకి వెళుతోంది. రాష్ట్రంలో ఏ అనర్థం జరిగినా అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబే కారణమని ప్రజలంతా నమ్మాలని జగన్ కోరుకుంటున్నారు. అలాగే రేవంత్ పాలన అధ్వాన్నమని ప్రచారం చేస్తే కొందరైనా నమ్ముతారని, తమ పార్టీ వారు నమ్మి జారుకోకుండా ఉంటారని బిఆర్ఎస్ నేతల ఆరాటం. అందుకే ఈ బరితెగింపు రాజకీయాలు చేస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్, చెరువుల ఆక్రమణలు, బలవంతంగా భూములు లాక్కోవడం, అప్పులు చేయడం వంటి వాటిపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడడం లేదు. పార్టీ ఫిరాయింపులపైనా సుద్దులు మాట్లాడుతున్నారు. తెలంగాణకు తామే పేటెంట్ అన్నట్లుగా వారిద్దరి వ్యవహార శైలి ఉంది. ప్రజలు మంచీచెడు తెలుసుకోవాలి. మంచికోసం నిలబడాలి. చెడుకోసం కలబడాలి. అప్పుడే రాజకీయాలు మారుతాయని గుర్తించాలి.

# గాలిలో దీపంగా ఆనకట్టల భద్రత



హైదరాబాద్,దేశంలో ఆనకట్టల భద్రత గాలిలో దీపంలా తయారైంది. దేశంలోని 5334 భారీ ఆనకట్టల్లో 220 వరకు శతాబ్దం నాటివి. మరో వెయ్యికి పైగా ప్రాజెక్టులు నిర్మాణమై 50 నుంచి వందేళ్లు కావస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఆనకట్టలు వరదలకు అల్లాడిపోయాయి. ఎగువ రాష్ట్రాల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు కురియడంతో వరదనీరు ముంచుకొచ్చి ఆనకట్టలపై ఒత్తిడి ఎక్కువైంది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజి 69వ గేటు దెబ్బతినగా, తుంగభద్రా డ్యామ్‌లోని 19వ నెంబర్ గేటు గల్లంతుకావడం ఆందోళన కలిగించింది.విజయవాడ ప్రకాశం బ్యారేజీకి సెప్టెంబర్ 1న నాలుగు బోట్లు ఢీకొనడంతో గేట్లు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇక తెలుగు, కర్ణాటక రాష్ట్రాలకు సాగునీరు అందించే తుంగభద్ర డ్యామ్ 19వ నెంబర్ గేటు ఒక్కసారిగా కొట్టుకుపోవడం ఆనకట్టల భద్రత ప్రశ్నార్థకంగా తయారైంది. 1953లో నిర్మాణమైన తుంగభద్ర డ్యామ్ దాదాపు 70 ఏళ్లుగా గేట్ల విషయంలో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. ఇప్పుడు ఒక్కసారిగా 19వ గేటు గల్లంతుకావడం నిర్వహణ లోపమా, లేదా మరేదైనా కారణం ఉందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్టు కర్ణాటకతో పాటు ఆంధ్రలోని రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లోని లక్షలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తోంది. అలాగే కొన్ని వందల గ్రామాల దాహార్తిని తీరుస్తోంది. ఈ ప్రాజెక్టుకు ఉన్న సమస్య దీనికి స్టాప్ లాగ్ గేట్లు లేవు. అందువల్ల వేలాది క్యూసెక్కుల నీటిని కిందకు వదలక తప్పడం లేదు.ఇప్పుడు స్టాప్ లాగ్ గేటును వీలైనంత త్వరగా అమర్చడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ గేట్లను ఆపరేట్ చేయడానికి చెయిన్ విధానాన్ని అప్పట్లో ఏర్పాటు చేశారు. కొత్త ప్రాజెక్టుల్లో రేడియల్ గేట్లు ఏర్పాటు అవుతున్నాయి. ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద వస్తున్న సమయంలో సెప్టెంబర్ 1న నాలుగు మరబోట్లు గేట్లను ఢీకొనడంతో 69వ గేటు దెబ్బతింది. దీంతో ఆ గేటు మరమ్మతు చేపట్టారు. ఇక శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ఆనకట్టలు ఎంతవరకు భద్రంగా ఉన్నాయని ఆలోచిస్తే రెండేళ్ల క్రితమే ఈ ఆనకట్టల పరిస్థితిపై చర్చ జరిగింది. ఈ మూడు డ్యామ్‌ల భద్రతను నిర్ధారించడానికి తక్షణ చర్యలు అవసరమని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కెఆర్ఎంబి) హెచ్చరించింది. ఈ మూడు ప్రాజెక్టులు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. శ్రీశైలం, పులిచింతల డ్యామ్‌లను ఎపి నిర్వహిస్తుండగా, నాగార్జునసాగర్ డ్యామ్‌ను తెలంగాణ నిర్వహిస్తుందని అజెండాలో ఉంది. కానీ పూర్తి బాధ్యతలు అప్పగించకపోవడంతో నిర్వహణ బాధ్యతలు అపారదర్శకంగా మారాయి.శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు కొన్నిమరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. పులిచింతలలో 2021 వరదల సమయంలో రేడియల్ గేట్లలో ఒకటి దెబ్బతిని స్పిల్‌వే కింద పడిపోయింది. ఇవన్నీ నిర్వహణ లోపం వల్లనే సంభవిస్తున్నాయి. ఆంధ్రలోని కడప జిల్లాలో చెయ్యేరుపై నిర్మించిన అన్నమయ్య ప్రాజెక్టుకు 2021 నవంబరులో వరదలు వచ్చేవరకు మరమ్మతులు లేవంటే నిర్వహణ తీరు ఎలా ఉందో తెలుస్తుంది. 2020 నవంబరులో భారీ వరదకు ఈ ప్రాజెక్టు గేటు దెబ్బతింది. తెలంగాణలో 2019 వరద సమయంలో మూసీ ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయింది. గేట్ల మరమ్మతు జరగకపోవడానికి రాజకీయ పరమైన కారణాలు కూడా ఉంటున్నాయి. ప్రాజెక్టుల నిర్మాణం మొదలు నిర్వహణ వరకు నాయకుల మితిమీరిన జోక్యం ఏ పనికానివ్వడం లేదు. చాలా మంది నాయకులకు కాంట్రాక్టులతో సంబంధాలు ఉంటున్నాయి. ఇంజినీర్లు కూడా ఒకవైపు కాంట్రాక్టర్లకు , మరోవైపు రాజకీయ ప్రజాప్రతినిధులకు తలొగ్గి పని చేయవలసి వస్తోంది. ఇంతేకాకుండా చాలా ప్రాజెక్టులకు కావలసిన నిధులు కేటాయింపు జరగడం లేదు.శ్రీశైలం ప్రాజెక్టుకు 2009 లో వచ్చిన వరదల వల్ల ఆనకట్ట పునాది దెబ్బతింటుందని మరమ్మతులకు రూ.700 కోట్ల వరకు వ్యయమవుతుందని అంచనా వేశారు. అయినా పనులు సజావుగా సాగలేదు. దేశంలో అనేక ఆనకట్టల నిర్మాణం, నిర్వహణ లోపాల వల్ల తీవ్రస్థాయిలో వరదలు దాపురించి ఊళ్లకు ఊళ్లే జలమయమవుతున్నాయి. ఉత్తరాఖండ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో గత కొన్నేళ్లుగా వరదలు ఉధృతంగా ముంచుకు రాడానికి ఆనకట్టలు నిర్వహణ లోపాలు పరోక్షంగా కారణమవుతున్నాయి. ఆనకట్టల భద్రతకు సంబంధించి డ్యామ్ సేఫ్టీ బిల్లును 2019లో పార్లమెంట్ ఆమోదించింది. అయినా ఇంతవరకు సరైన అజమాయిషీ జరగడం లేదు. అయితే 2012 నాటి జాతీయ జల విధానం ప్రతి ఆనకట్టకూ సమానమైన ప్రాధాన్యం ఇస్తూ సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తోంది. ఇందులో కేంద్ర ప్రభుత్వంతోపాటు ఆయా రాష్ట్రాలు కూడా నిర్వహణలో పాలుపంచుకోవడమే కాదు, పకడ్బందీ పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉంటేనే ఆనకట్టలకు భద్రత లభిస్తుంది.

# ప్రాంతీయ విమాన అనుసంధాన పథకం

న్యూఢిల్లీ,భారత పౌర విమానయాన రంగం ప్రగతి పట్ల ప్రధాని నరేంద్ర మోడీ సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రాంతీయ విమాన అనుసంధాన పథకంతో విమాన ప్రయాణం సామాన్యులకు సైతం చేరువైందని తెలిపారు. పౌర విమానయానంపై జరుగుతున్న రెండవ ఆసియా పసిఫిక్ మంత్రిత్వస్థాయి సమావేశంలో ప్రధాని మోడీ గురువారం ప్రసంగిస్తూ దేశాభివృద్ధిలో పౌర విమానయాన రంగం ప్రధాన పాత్ర పోషిస్తుందని, ఈ రంగం ద్వారా పెద్ద సంఖ్యలో ఉద్యోగాల కల్పన జరుగుతుందని తెలిపారు. మధ్య తరగతి ప్రజలకు విమానయానాన్ని చేరువ చేయడంలో తోడ్పడిన ప్రాంతీయ విమాన అనుసంధాన పథకం(ఉడాన్) కింద 1.4 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారని మోడీ తెలిపారు.పెరుగుతున్న మధ్య తరగతి ప్రజలు, వారి డిమాండు విమానయాన రండానికి చోదక శక్తులుగా ఆయన అభివర్ణించారు. ఉడాన్ కారణంగా విమాన ప్రయాణం అందరికీ అందుబాటులోకి వచ్చిందని ఆయన అన్నారు. విమానయానంలో ఆధునికత కోసం కృషిచేస్తున్న ప్రభుత్వం త్వరలోనే ఎయిర్ ట్యాక్సీలను తీసుకురానున్నదని ఆయన తెలిపారు. బుధవారం ప్రారంభమైన రెండు రోజుల సమావేశంలో ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన రవాణా, విమానయాన శాఖ మంత్రులు, రెగ్యులేటరీ సంస్థలు,

# ధర్నాకు రైతుసంఘం పిలుపు

విజయనగరం,ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రాష్ట్రంలో దెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు రూ.25000, వాణిజ్య పంటలకు రూ.50000 చొప్పున్న నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో సచివాలయం వద్ద సెప్టెంబర్ 17, 18 తేదీల్లో మండల కేంద్రాల్లో 23,24 తేదీల్లో 26 న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నమని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక ఎన్ పి అర్ శ్రామిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షానికి ప్రభుత్వం ప్రకటించిన 5,67000 ఎకరాలు కంటే మూడు రెట్లు ఎకరాలకు పంట నష్టం జరిగిందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 10,000 నష్టపరిహారం సరికాదన్నారు. వరి పంటకు 25000, వాణిజ్య పంటలకు రూ.50,000 నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ంద్రబాబు నాయుడు పెట్టుబడి సాయం రూ.20,000 ఇస్తామని ఎన్నికలలో హామీ ఇచ్చారు. రైతులకు రూ?20వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచిపోయింది. వ్యవసాయానికి పెట్టుబడుల కొరకు బ్యాంకులు ఇతర ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చుట్టూ రైతులు, కౌలు రైతులు తిరగాల్సి వస్తున్నదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేల పెట్టుబడి సాయం రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. కనుక తక్షణమే ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రైతుల ఖాతాలో వెంటనే జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతుకు గుర్తింపు కార్డు ? బ్యాంకు రుణాలు-సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు.÷ాష్ట్రంలో 30 లక్షల మందిపైగా కౌలుదారులు ఉన్నారు. కౌలు వ్యవసాయం విస్తరిస్తున్నది. భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా వాస్తవ కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలనారు. అన్నదాత సుఖీభవ రూ. 20,000 పెట్టుబడి సాయంతో పాటు బ్యాంకు రుణాలు, రైతు సంక్షేమ పథకాలు అన్ని అమలు చేయాలన్నారు. 10 లక్షల మంది కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ప్రకటించి అమలు చేస్తామన్నారు. కౌలురైతు గుర్తింపు కార్డుల పంపిణిలో వాస్తవ సాగుదారులకు కాకుండా బినామీలు, అనర్హులకు కౌలు గుర్తింపు కార్డులు ఇస్తున్నారు. ఈ మోసాన్ని అరికట్టాలన్నారు. వాస్తవసాగుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. 2023 పంటల భీమా ఇవ్వాలి- ప్రతి రైతుకు 2లక్షలు రుణమాఫీ చేయాలి కరువు కారణంగా వంటలు పండక పోవడం, పంటలు పండినా గిట్టుబాటు ధర లేకపోవడం÷-రకృతి వివత్తులు, మార్కెట్ ఒడిదుడుకుల మధ్య వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు అప్పుల పాలు అవుతున్నారన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రతీ రైతుకు సగటున రూ.2.50 లక్షలు అప్పులు ఉన్నాయి. సగటు రైతు కుటుంబం అప్పుల నుండి బయటపడలేకపోతున్నది. కనుక రాష్ట్ర ప్రభుత్వం రూ.2.00 లక్షల వరకు రైతులు అన్ని రకాల బ్యాంకు రుణాలను మాఫీ చేయవలసిందిగా కోరుచున్నామన్నారు. పక్కనే తెలంగాణా రాష్ట్రంలో రూ.2:00 లక్షల వరకు రైతుల రుణాలను మాఫీ చేసింది. మన రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలు మాఫీ చేసి రైతులను అదుకోవాలన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టాదు కేంద్ర బిజెపి ప్రభుత్వ ఒత్తిడితో గత ప్రభుత్వం వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టేందుకు జి.ఓనెం. 22 తెచ్చిందన్నారు. మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తే మంత్రి లోకేష్ బాబు మీటర్లను పగులగొట్టమని పిలుపు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వం అనుసరించిన విధానాన్ని అనుసరించడం సరైనది కాదన్నారు. మోటర్లకు మీటర్లు పెట్టడం అదాని కంపెనీకి తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు కనుక జిఓ నెం 22 రద్దుచేయాలన్నారు. పరిపోరం తక్షణమే రైతులకు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 350 కి పైగా మండలాలలో వర్షాభావ పరిస్థితులు ఉంటే గత ప్రభుత్వం 102 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించింది. కరువు, తుఫాన్లతో నష్టపోయిన రైతాంగానికి ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందలేదన్నారు. 2023 ఖరీఫ్, రబీ సీజన్లో వంటలు నష్టపోయిన రైతులకు వంటల బీమా పరిహారం ఇవ్వాలి, గడిచిన 3,4 సంవత్సరాలు వంటలబీమా పరిహారం జూన్, జూలై మాసాలలో రైతుల ఖాతాలలో జమచేశారు. కానీ ఈ సంవత్సరం ఆగస్టు దాటినా పంటల బీమా పరిహారం రైతులకు అందలేదు. తక్షణమే వంటలబీమా పరిహారం రైతుల ఖాతాలలో జమచేయాలని కోరారు. అసంపూర్తిగా వున్న ప్రాజెక్టులు, కాలువలు తారకరామ, గుర్ల గెడ్డ, తోటపిల్లి, గజపతినగరం బ్రాంచీ కాలువ నిధులు ఇచ్చి పూర్తి చేయాలనీ డిమాండ్ చేశారు. తోటపల్లి, మడ్డువలస, వెంగళరాయ, తాటిపూడి, ఆంధ్రకాలువలు సిమ్మెంట్ లైనింగ్ చేసి చివరి ఆయకట్టువరకు నీరు అందించాలన్నారు. చిన్ననీటివనరులు, లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్లు మరమ్మత్తులు చేసి సాగునీరు అందించాలి. జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ హైవే, సుజల స్రవంతి కాలువ, గిరిజన యూనివర్సిటీ, ఎయిర్ పోర్ట్, 516 పెందుర్తి- బొడ్డవర హైవే, రహదారులు, రైల్వేతదితర భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు 2013 చట్టప్రకారం పరిహారం ఇవ్వాలన్నారు. జిల్లాలో సహకార రంగం లో వున్న భీమసింగ్ చక్కెర ఫాక్టరీ కి ఆధునీకరణకు నిధులు ఇచ్చితెరిపించాలి. ఎన్.సి.ఎస్ షుగర్ ఫాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని తెరిపించాలనీకోరారు. 17,18 తేదీల్లో సచివాలయాలకు వినతి, 23,24 తేదీల్లో మండలాల ధర్నాలు సెప్టెంబర్ 26న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమంలో రైతులు,కౌలు రైతుల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విలేకర్ల సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, కౌలు రైతుల సంఘం నాయకులు రాకోటి రాములు పాల్గొన్నారు.

# మన్నికతో రోడ్ల నిర్మాణం

అమరావతి,రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి, నిధుల అవసరం, ప్రస్తుతం ఉన్న సమస్యలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు..రోడ్ల మరమ్మతులు, నిర్మాణంలో కొత్త, మెరుగైన సాంకేతికతను వినియోగించే విషయంపై సమీక్షలో చర్చించారు. తక్కువ ఖర్చుతో, ఎక్కువ మన్నిక ఉండేలా, త్వరతగతిన పూర్తి అయ్యేలా రోడ్ల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు..పాత పద్దతిలో కాకుండా పలు రకాల మెటీరియల్స్, టెక్నాలజీ ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేపడితే కలిగే ప్రయోజనాలపై ఆలోచించాలని సీఎం తెలిపినట్లు వారికి వివరించారు..రోడ్ల అభివృద్ధి విషయంలో 3 అంశాలు దృష్టిలో ఉంచుకోవాలని అన్నారు..ముందుగా డ్రోన్ టెక్నాలజీ వినియోగించి ఎక్కడెక్కడ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలో తెలుసుకోవాలన్నారు.. ప్రాధాన్యత క్రమంలో మొదట గుంతలు(ఖనీబితన్గీ÷బ)పూడ్చే పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.. తర్వాత రోడ్లపై పడిన గండ్లను, తెగిపోయిన రహదారులను మరమ్మత్తు చేయాలన్నారు.. మూడో అంశంగా రోడ్ స్టాటిస్టిక్స్ డేటా సేకరించాలన్నారు.సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ను సంప్రదించి ఓఆర్ఆర్ నిర్మాణానికి అవసరమైన భూమి వివరాలు సేకరించాలని తెలిపారు. రాష్ట్రంలో రూ.58,874 కోట్లతో 105 ఆన్ గోయింగ్ ప్రాజెక్ట్ లు పురోగతిలో ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు సిఎస్ కి తెలిపారు.

# రష్యాలో గూఢచర్యం ఆరోపణలు

మాస్కో,గూఢచర్యం ఆరోపణలతో మాస్కోలోని ఆరుగురు బ్రిటన్ దౌత్యవేత్తలను బహిష్కరించినట్లుగా రష్యా భద్రతాధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రిటన్ రాయబార కార్యాలయంలోని ఆరుగురు దౌత్యవేత్తలు రష్యాకు సంబంధించిన సైనిక, పాలనాపరమైన సమాచారాన్ని తమ శత్రు దేశాలకు చేరవేస్తున్నట్లుగా ఆధారాలు లభ్యమయ్యాయి. దీనివల్ల రష్యన్ ఫెడరేషన్ భద్రతకు ముప్పు పొంచి ఉన్నట్లుగా భావించి వెంటనే వారి అక్రిడిటేషన్లు రద్దు చేసినట్లు మాస్కో అధికారులు పేర్కొన్నారు. 'ఫెడరల్ సెక్యూరిటీ సర్వీసెస్ ఆఫ్ రష్యా బ్రిటిష్ ఎంబసీ రాజకీయ విభాగానికి చెందిన ఆరుగురు సభ్యులు గూఢచర్యానికి పాల్పడినట్లుగా ఆధారాలు సమర్పించింది. అయితే ఇప్పటివరకు లండన్‌కు, రష్యాకు మధ్య ఉన్న స్నేహపూర్వక చర్యల కారణంగా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా దౌత్యవేత్తలను బహిష్కరించాం' అని రష్యన్ అధికారులు పేర్కొన్నారు. ఈవిషయంలో ఇతర బ్రిటన్ దౌత్యవేత్తల ప్రమేయం ఉందని తెలిస్తే వారిని కూడా బహిష్కరిస్తామని పేర్కొన్నారు. మాస్కోలోని బ్రిటీష్ రాయబార కార్యాలయం దౌత్య ఒప్పందాల గురించే కాక దేశానికి నష్టం కలిగించే గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో పాటు దేశ ప్రజలకు హాని కలిగించాలనే ఉద్దేశపూర్వక చర్యలకు ఒడిగడుతున్నట్లుగా రష్యా విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై మాస్కోలోని బ్రిటన్ రాయబార కార్యాలయం నుంచి ఎటువంటి స్పందన లేదు. స్పందించలేదు.కాగా గూఢచర్యం ఆరోపణలతో రష్యా రాయబార కార్యాలయంలోని రక్షణ వ్యవహారాలను పర్యవేక్షించే ఓ అధికారిని బ్రిటన్ ఇటీవల బహిష్కరించింది. తమ దేశంలో రష్యా నిఘా కార్యకలాపాలను ఈ అధికారి పర్యవేక్షిస్తున్నారని బ్రిటన్ హోంశాఖ కార్యాలయం తెలిపింది. ఈవిషయంలో రష్యా రాయబారికి కూడా సమన్లు పంపి.. ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని హెచ్చరించినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ దాడులు

చండీఘడ్,పంజాబ్‌లోని పలు ప్రాంతాల్లో జాతీయ భద్రతా సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం దాడులు నిర్వహించింది. పంజాబ్‌లోని మోగా, అమృత్‌సర్, గురుదాస్‌పూర్, జలంధర్‌లో ఈ దాడులు జరిగాయి. కెనడాలోని ఒట్టావాలోని భారత హైకమిషన్‌పై ఖలిస్తాన్ మద్దతుదారులు దాడికి సంబంధించి ఈ దాడి జరిగింది. ఈ వ్యవహారంపై గతేడాది జూన్‌లో ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఈ కేసులో పంజాబ్‌లోని ఖండూర్ సాహిబ్‌కు చెందిన స్వతంత్ర ఎంపీ అమృత్ పాల్ సింగ్ బావ అమర్ జోత్ సింగ్ నిందితుడు. మార్చి 2023లో కెనడాలోని ఒట్టావాలోని భారత హైకమిషన్ వద్ద ఖలిస్తాన్ మద్దతు దారులు భారత వ్యతిరేక నినాదాలు చేయడం, కమిషన్ గోడపై ఖలిస్థాన్ జెండాలు వేయడం, హ్యాండ్ గ్రెనేడ్‌లు విసిరి నిరసన తెలిపారని ఎన్ఐఏ ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. గతేడాది ఒట్టావాలోని హైకమిషన్‌పై దాడి తర్వాత భారత్, కెనడా మధ్య సంబంధాల్లో చీలిక ఏర్పడింది. ఈ విషయం ఎంతగా పెరిగిందంటే, భద్రతను పేర్కొంటూ కెనడాలోని 41మంది దౌత్యవేత్తలను భారత్ వెనక్కి పిలిపించింది,దీనికి ప్రతిస్పందన గా కెనడా కూడా తన దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించింది. కొంతకాలం తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు సాధారణ స్థితికి వచ్చాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు భారత్‌పై నిందలు వేయాలని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ప్రయత్నించడంతో ఈ నిరసనలు చెలరేగాయి. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జూన్‌లో బ్రిటిష్ కొలంబియాలోని గురుద్వారా వెలుపల నిజ్జర్‌ను కాల్చి చంపడం గమనార్హం. కెనడా, బ్రిటన్, యుఎస్ రాయబార కార్యాలయాలతో సహా వివిధ ప్రదేశాలలో నిరసనలు జరిగాయి. ఖలిస్థాన్ అనుకూల నిజ్జర్‌ను భారతదేశం చంపిందని ఆరోపించింది.

# ప్రిస్కిప్షన్ లేకుండానే అమ్మకాలు

అచ్చంపేట : అచ్చంపేటలో మెడికల్ షాపు యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.వారి దోపిడీకి అంతేలేకుండా పోతోందన్న విమర్శలు ఉన్నాయి. కాలంచెల్లిన మందులను వినియోగదారులకు అంటగడుతున్నారని ఆరోపణలు లేకపోలేదు. జనరిక్ మందులు ఇచ్చి బ్రాండెడ్ మందుల ధరలను వసూలు చేస్తున్నారు. ఔషధ నియంత్రణ అధికారుల పర్యవేక్షణ లోపంతో మెడికల్ షాపు యజమానులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే

ఇక్కడ డాక్టర్ రాసే ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులూ అమ్మేస్తుంటారు. తలనొప్పి, జ్వరం, కడుపు నొప్పి, ఒళ్లు నొప్పులు, నిద్ర పట్టకపోవడం నుంచి ఎలాంటి ఇన్‌ఫెక్షన్ లాంటి అనారోగ్య సమస్యలకైనా, గ్యాస్ట్రిక్ సమస్యలు, కార్డియాలజీ, సైక్రియాట్రిక్, న్యూరాలజీ, యూరాలజీ, బ్రెయిన్ స్ట్రోక్, డయాబెటిక్, బీపీ, థైరాయిడ్, యూరిన్ ఇన్ఫెక్షన్ ఇలా ఏ సమస్యకైనా మెడికల్ స్టోర్స్ యజమానులు మందులు ఇచ్చేస్తున్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడ్డవారు కొందరు దగ్గు నివారణకు వాడే టానిక్‌లు, అలాగే మత్తును కలిగించే టానిక్‌ను నేరుగా మెడికల్ షాపుల నుంచి తెచ్చుకుంటున్నారు. ఈ తరహా సిరప్‌లు డాక్టర్ రాసిస్తేనే రోగికి ఇవ్వాలి. కానీ కొన్ని మెడికల్ షాపుల్లో ఆ నిబంధనలు పాటించడం లేదు.

రిజిస్టర్డ్ ఫార్మసిస్టులెక్కడ?

నిబంధనల ప్రకారం మెడికల్ షాపులో రిజిస్టర్డ్ ఫార్మాసిస్ట్ ఉండాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు ఇవ్వాలి. అయితే అచ్చంపేటలోనే కాదు.. జిల్లాలో కూడా చాలా ప్రాంతాల్లో మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధలను పాటించడం లేదని తెలుస్తోంది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇచ్చేస్తున్నారు. ఫార్మసీ కౌన్సిల్ సర్టిఫికెట్ ఇచ్చిన డి-ఫార్మసీ/ బీ-ఫార్మసీ అభ్యర్థులు లేకుండా మందులు అమ్మకూడదని నిబంధన కూడా మెడికల్ షాపు యజమానులు పట్టించుకోవడం లేదు. మెడికల్ షాపులకు అనుమతిచ్చే సమయంలో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఫార్మాసిస్టు ఉన్నదీ లేనిది పరిశీలించుకోవాలి. ఏరియా డ్రగ్? ఇన్‌స్పెక్టర్లు ఈ బాధ్యత నిర్వర్తించాలి. కానీ ఎక్కడా కానరావడం లేదు.

కానరాని క్వాలిఫైడ్ పర్సన్స్

అచ్చంపేట పట్టణంలో అధికంగా మెడికల్ షాపుల్లో క్వాలిఫైడ్ పర్సన్స్ కానరావడం లేదు. తక్కువ వేతనంతో యువతీ, యువకులకు పనిలో పెట్టుకుంటున్నారు. మెడిసన్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులతో మందులు విక్రయిస్తున్నారు. ఇదీ ప్రమాదకరమని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. జనరిక్, నాన్ జనరిక్ అనే తేడా లేకుండా షాపుల నిర్వాహకులు ఔషధ కంపెనీలతో పర్సంటేజీలు మాట్లాడుకొని వైద్యులతో కుమ్మక్కై ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

# సాగర్‌లో గణనాథుని నిమజ్జనం.. ప్రతీసారి ఎందుకీ పంచాయితీ ?

హైదరాబాద్,వినాయకచవితి వేడుకల్లో అత్యంత కీలకమైన ఘట్టం వినాయన నిమజ్జనం. నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుడిని గంగమ్మ ఒడికి చేర్చడం ఓ వేడుకే అని చెప్పాలి. అయితే ప్రతి ఏటా వినాయక నిమజ్జనం అనగానే ఓ డైలమా.. ఓ పంచాయితీ. ఇప్పుడు కూడా అదే పంచాయితీ. అదే గందరగోళం సాగర్‌లో నిమజ్జనం ఉందా? లేదా? అని. ఇంతకీ సాగర్‌లో నిమజ్జనం విషయంలో ప్రతిసారీ ఈ పంచాయితీ ఎందుకు? హైకోర్టు డైరెక్షన్స్ ఏంటి? ప్రభుత్వ నిర్ణయం ఏంటి? ఈ సమస్యకు శాశ్వత పరిష్కారమేంటి?వినాయక చవితి వచ్చిందంటే చాలా విషయాలు రొటీన్‌గా జరుగుతాయి. ప్రతి ఇంటిలో, గల్లీలో ఆ గణనాథుడిని కొలువుదీర్చుకోవడం. భక్తి, శ్రద్ధలతో పూజలు చేయడం.. వైభవంగా వేడుకలను నిర్వహించుకోవడం. ఇవి ఎంత రొటీన్‌గా జరుగుతాయో.. అంతే రొటిన్‌గా హైకోర్టులో విచారణ జరుగుతుంది. హుస్సేన్‌సాగర్‌లో వినాయక విగ్రహాలను చేయాలా ? వద్దా? అని. మీరు గత ఐదారేళ్లుగా అబ్జర్వ్ చేయండి.. ప్రతిసారి ఇదే జరుగుతుంది. ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుంది.. క్రేన్లు సిద్ధం చేస్తుంది. సిబ్బందిని మోహరిస్తుంది. తీరా హైకోర్టులో ఎవరో ఒకరు పిటిషన్ వేస్తారు. దీంతో డైలమా మొదలవుతుంది.. హైకోర్టు అక్షింతలు వేస్తుంది. మట్టి వినాయకులనే నిమజ్జనం చేయాలంటోంది.మళ్లీ ఒకసారి వెసులుబాటు ఇస్తుంది.. ఈసారి కూడా అదే జరిగింది.నిమజ్జనానికి కావాల్సిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయి. మళ్లీ పటిషన్ పడింది హైకోర్టులో.. అయితే దాన్ని కోర్టు తిరస్కరించి గత ఆదేశాలనే అమలు చేయాలంది. మరి హుస్సేన్ సాగర్‌లో ఇంతకీ నిమజ్జనం ఉందా? ఉంటే ఏ విగ్రహాలకు మాత్రమే ఉంది? హైదరాబాద్‌లో పర్మిషన్ లేకుండా ఎవరూ గణేష్ మండపాలను ఏర్పాటు చేయకూడదు. ఇప్పటికే అన్ని పర్మిషన్స్ తీసుకొని వేలాది మండపాలను ఏర్పాటు చేశారు. అయితే ఇందులో మట్టి విగ్రహాలు కొన్నే.. POP విగ్రహాలే చాలా ఎక్కువగా ఉన్నాయి. భారీ విగ్రహాలు అయితే ఇంకా అనేకం ఉన్నాయి. ఇప్పుడివన్నీ నిమజ్జనానికి తరలాలి. మరి ఈ విగ్రహాలన్ని ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలి అనేది అసలు ప్రశ్న.ఎందుకంటే హైకోర్టు ఆదేశాల ప్రకారం కేవలం మట్టి విగ్రహాలను మాత్రవే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయాలి.POPతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తే కోర్టు ధిక్కరణే అవుతుంది. దీంతో ఇప్పుడు అధికారులు డైలమాలో పడ్డారు. ఏం చేయాలి.. ఏం చేయకూడదన్న సందేహంలో ఉన్నారు.ఇక్కడ అధికారులు ఎంత డైలమాలో ఉన్నారనడానికి ఓ ఉదాహరణ చెప్పుకోవాలి. నిజానికి సాగర్ పరిసరాల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు. ఇంతలో హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. వెంటనే సాగర్ పరిసరాల్లో నిమజ్జనాలు చేయకూడదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు అనుమతి లేదంటూ బ్యానర్లు కట్టారు. హైకోర్టు పిటిషన్ కొట్టేయగానే బ్యానర్లను తొలగించారు. కాబట్టి.. అధికార యంత్రాంగానికి ఇక్కడో క్లారిటీ లేనట్టు కనిపిస్తోంది.నిజానికి అధికారుల తీరు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్టు ఉంది. అసలు POPతో తయారయ్యే విగ్రహాలకు ఆదిలోనే



అడ్డుకట్ట వేస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా. కానీ ఇన్నేళ్లుగా కోర్టు కచేరీలు చేస్తున్నా కానీ.. ఈ వైపుగా ఒక్క అడుగు కూడా వేయలేదు అధికారులు. తీరా విగ్రహాలను కొని తెచ్చుకొని.. పూజలు చేసుకున్న తర్వాత నిమజ్జనానికి అనుమతి లేదంటే భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఎందుకు ఉంటాయి? మీకు నిజంగా సమస్యను పరిష్కరించాలని ఉంటే.. ముందు నుంచే దీనిపై ఓ క్లారిటీతో ఉండాలి. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి. ఇలా ఆఖరి నిమిషంలో భక్తులను ఇబ్బంది పెట్టకూడదు.ఇక్కడ మరో విషయం కూడా ఉంది. అసలు సాగర్‌లో నిమజ్జనం చేస్తే వచ్చిన సమస్య ఏంటన్నది హిందూ సంస్థల వాదన. హుస్సేన్ సాగర్ మంచినీటి చెరువా? అంటే కాదు. పోనీ అదేమన్న కాలుష్య రహితంగా ఉందా? అంటే అదీ లేదు. ఇప్పటికే కాలుష్యానికి మారుపేరులా ఉంది సాగర్. అంతేకాదు హుస్సేన్ సాగర్ అయితే నగరం మధ్యలో ఉంటుంది. ఎక్కడెక్కడి నుంచో ప్రజలు ఒక్కచోటికి వచ్చినట్టు ఉంటుంది. అందుకే తాము హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేయాలని కోరుతున్నామంటున్నారు. వీటన్నింటితో పాటు ఖైరతాబాద్ బడా గణేష్ నిమజ్జనానికి హుస్సేన్ సాగర్ తప్ప మరో ఆప్షన్ లేదనే చెప్పాలి. అంత పెద్ద విగ్రహాన్ని మరో ప్రాంతానికి తరలించాలన్నా అది చాలా పెద్ద టాస్క్.ఇన్ని అంశాలు ఉన్నాయి కాబట్టే ఇక్కడే నిమజ్జనానికి అనుకూలం అంటూ వాదిస్తున్నారు.భాగ్యనగర్ పరిధిలో సాగర్ ఒక్కటే ఉందా? ఇంకా చెరువులు లేవా ? అని మీకు అనుమానం రావొచ్చు. అలా ప్రశ్నించడంలో తప్పు లేదు. మీకొచ్చిన అనుమానాలు, ప్రశ్నలు నిజమే. గ్రేటర్ పరిధిలో గణేష్ నిమజ్జానికి 66 చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటన్నింటి వద్ద మీరు ఏర్పాట్లు చేస్తున్నారని కూడా తెలుసు. కానీ ట్యాంక్‌బండ్ వద్దకు ఎలాంటి విగ్రహాలు వస్తాయి? ఎన్ని విగ్రహాలు వస్తాయి? అనేది ఒక్కసారి గుర్తు చేసుకోండి. రెండు రోజులకు మించి జరుగుతుంది ట్యాంక్ బండ్ వద్ద వినాయక నిమజ్జనం. ఇప్పుడు చివర్లో అలాంటి అవకాశం లేదంటే ఎలా? ఇక్కడ హైకోర్టును అనడానికి ఏం లేదు. ఎందుకంటే హైకోర్టు గతంలోనే క్లియర్‌కట్‌గా చెప్పింది. మట్టి వినాయకులను తప్ప మరే విగ్రహాన్ని నిమజ్జనం చేయవద్దని.. మరి ఈసారి ఏం చేస్తారు? ఎలా నిమజ్జనం చేస్తారు? అనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది. మొత్తానికి విఘ్నాలు తీర్చే ఆ గణనాథుడి నిమజ్జనానికి మాత్రం అనేక విఘ్నాలు కనిపిస్తున్నాయి.

# వైరస్ పీచమణచాలి..



న్యూఢిల్లీ,ఆఫ్రికా ఖండాన్ని భయపెడుతున్న మంకీపాక్స్ కేసులు మనదేశంలోనూ నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. విదేశాల నుంచి వచ్చిన ఇద్దరు యువకుల్లో అనుమానిత లక్షణాలు కనపడడంతో- వారిని ఢిల్లీ జయప్రకాశ్ నారాయణన్ ఆసుపత్రిలో ఐసోలేషన్‌లో ఉంచి, పరీక్షలు నిర్వహించారు. ఇద్దరికీ మంకీపాక్స్ వైరస్ సోకినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ సోమవారం ప్రకటించింది.

2022 జులై నుంచి ఇప్పటివరకూ మనదేశంలో 30 మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయని, వాటి వలె తాజా కేసులూ ఉన్నాయని, భయపడాల్సిన అవసరం లేదని పేర్కొంది. అదే సందర్భంలో రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా ఉండాలని, విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల్లో ఈ వైరస్ లక్షణాలు కనిపిస్తే ఐసోలేషన్‌లో ఉంచి, వైద్య పరీక్షలు జరపాలని సూచించింది.ఆఫ్రికా దేశాల్లో, ముఖ్యంగా డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మంకీపాక్స్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నాయి. పదిహేను నెలల క్రితమే కేసులు నమోదు కాగా, ఇది అంతగా ఆందోళన చెందాల్సిన విషయం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) పేర్కొంది. ఆ తరువాత కూడా కేసులు పెరగడంతోనూ, అనేక దేశాల్లోకి వైరస్ వ్యాప్తి చెందడంతోనూ ఆరోగ్య అత్యయిక పరిస్థితిని ప్రకటించింది. విమానాశ్రయాల్లో తనిఖీలను కట్టుదిట్టం చేయాలని, ఏ కొద్దిపాటి లక్షణాలు కనిపించినా రోగులను ఐసోలేషన్‌లో ఉంచి, చికిత్స అందించాలని అన్ని దేశాలకూ మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రస్తుతం 116కు పైగా దేశాల్లో 16 వేల మంది మంకీపాక్స్ బాధితులు ఉన్నట్టు డబ్ల్యుహెచ్ఒ తెలిపింది. ఇది కోవిడ్ అంత వేగంగా వ్యాపించే వ్యాధి కానప్పటికీ -అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తోంది.1956లో తొలిసారి కోతుల్లో ఈ వ్యాధిని కనుగొన్నందున దీనికి మంకీపాక్స్ అని పేరు. 1970లో కాంగోలోనే ఓ వ్యక్తికి సోకింది. వైరస్ సోకిన 5 నుంచి 21 రోజుల్లో జ్వరం, చర్మం మీద దద్దుర్లు, కండరాల నొప్పి, గాయాలవ్వడం, చలి, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కాంగోలో ఇప్పుడు ఉనికిలో ఉన్న వైరస్ క్లాడ్ 1 టైపు అని, ఇది తన జన్యు ఉత్పరివర్తన లక్షణాలను మార్చుకొని తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తోందని గుర్తించారు. లైంగిక సంపర్కం ద్వారానే ఈ వైరస్ సోకుతుందని ఇప్పటివరకూ ఉన్న అవగాహన కాగా, కొత్త వేరియంట్ వైరస్ రోగికి దగ్గరగా ఉన్నా, ముట్టుకున్నా వ్యాప్తి చెందుతున్నట్టు తాజాగా గమనించారు. ఈ పరిస్థితుల్లోనే ప్రపంచ ఆరోగ్య సంస్థ మెడికల్ ఎమర్జెన్సీని ప్రకటించింది.ఇలాంటి సాంక్రమిత వ్యాధులు చుట్టుముడుతున్నప్పుడు అవి ఎక్కడ, ఏ పరిస్థితుల్లో తలెత్తినప్పటికీ అంతర్జాతీయ సమాజం మొత్తం బాధ్యతాయుతంగా స్పందించాలి. దేశాలకు సరిహద్దులు ఉంటాయి కానీ, వైరస్‌ల వ్యాప్తికి ఏ అడ్డంకులూ ఉండవు. కోవిడ్ కాలంలో ఈ వైపరీత్య వ్యాప్తి ఎంత వేగంగా జరుగుతుందో ప్రపంచం ప్రత్యక్షంగా అనుభవించింది. ఎయిడ్స్, ఆంత్రాక్స్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా ఎక్కడో పుట్టి, ఇప్పుడు ప్రపంచమంతటా తిష్ట వేశాయి. ఎవరి భద్రత వారే చూసుకుంటాం అంటే అది కుదిరే పని కాదు. అందుకనే కొత్త కొత్త వ్యాధులు కోరలు చాస్తున్నప్పుడే వాటి నియంత్రణకు, నిర్మూలనకూ చిత్తశుద్ధితో పూనుకోవాలి. ఇప్పుడు కాంగోలో కోటికి పైగా టీకా డోసులు అవసరం కాగా, 3 లక్షల డోసులు కూడా అందుబాట్లో లేవు. ఆకలిదప్పులతో అల్లాడిపోయే ఆ దేశం సొంతంగా టీకాలను సమకూర్చుకోవడం జరగని పని. టీకాలు అందిస్తామని అమెరికా, ఐరోపా దేశాలు మాట వరసకు చెప్పినా, ఆచరణలో ఇంతవరకూ చేసింది శూన్యం. లాభాలే పరమార్థంగా భావించే బహుళ జాతి మందుల కంపెనీలు రాబందుల్లా వేచి చూస్తున్నాయి తప్ప- ఆదిలోనే పరిస్థితిని అదుపు చేయటానికి ముందుకు రావటం లేదు. స్వలాభాలే పరమార్థంగా ఉన్న సంపన్న దేశాలూ, కార్పొరేటు కంపెనీలూ ఆధునిక ఆవిష్కరణలపై ఆధిపత్యం పొందుతాయి చేస్తాయి తప్ప వాటిని మానవాళి మేలు కోసం ఉపయోగించవు. పైగా వాటి మితిమీరిన ధనాకాంక్ష వైపరీత్యాల వ్యాప్తికీ, వ్యాధుల ఉధృతికి కారణమవుతుంది. ఆధునిక సామాజిక చైతన్యానికి, నాగరిక వికాసానికి రోగాలూ, వైపరీత్యాలూ లేని ప్రపంచం ఒక ఆదర్శవంతమైన ఆనవాలు. ఎక్కడ వ్యాధులు విస్తరిస్తున్నా అక్కడికి ఎల్లలెరగని ఆధునిక వైద్య పరిజ్ఞానం, మానవతా సహాయం వెల్లువెత్తాలి. ఆదిలోనే ప్రాణాంతక వైరస్‌ల పీచమణచాలి. అప్పుడే ప్రపంచ ఆరోగ్యానికి పరిపూర్ణమైన రక్ష!

# విశాఖవాసుల కొంగుబంగారం..కనకమహాలక్ష్మి అమ్మవారు

విశాఖపట్టణం,విశాఖవాసుల కొంగుబంగారం శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు. ఉత్తరాంధ్ర వాసులకేగాక సకల తెలుగు జనావళికి సత్యం గల తల్లిగా, కల్పవల్లిగా కోరిన వరాలిచ్చే అమృతమూర్తిగా భాసిల్లుతోందామె. బంగారం కొన్నా వెండి కొన్నా తమ ఇంట వివాహ వేడుకలు జరుగుతున్నా బిడ్డ పుట్టినా విశాఖప్రాంతవాసులు ఆ విశేషాన్ని కనకమహాలక్ష్మికి నివేదించి, ఆశీస్సులు అందుకోవడం ఇక్కడి ఆచారం. ఇది గోపురం లేని గుడి. మూలవిరాట్టుకు భక్తులు స్వయంగా పూజలు నిర్వహించుకోవడం ఈ క్షేత్ర విశిష్టత. ఏ వేళలో అయినా దర్శించుకునేందుకు వీలుగా 24 గంటలూ తెరిచి ఉంచే ఆలయం ఇది.ఈ అమ్మవారిని సేవించుకున్నా, స్మరించుకున్నా సకల ఐశ్వర్యాలు సిద్ధిస్తాయని నమ్మకం. కనకమహాలక్ష్మి అమ్మవారు ఈ ప్రాంతాన్ని పాలించిన విశాఖ రాజుల ఇలవేల్పు. ఆమె నెలకొన్న ఈ ప్రాంతంలో ఒకప్పుడు విశాఖ రాజుల కోటబురుజు ఉండేదని, అందుచే తల్లి ఉన్న ఈ ప్రాంతాన్ని బురుజుపేటగా పిలుస్తున్నారు. కనకమహాలక్ష్మి ఆలయం మొదటి నుంచీ ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోనే ఉంది. 1912 కాలంలో వీధి వెడల్పు చేస్తున్నప్పుడు అమ్మ వారి విగ్రహం కదపకుండా వీధి మధ్యలోనే ఉంచేసినా 1917లో రోడ్డు మధ్యభాగం నుంచి 30 అడుగుల దూరంలో ఒక మూలగా జరిపారు. అప్పుడే విశాఖలో ప్లేగు వ్యాధి ప్రబలింది. దీంతో ప్రజలు భయభ్రాంతులై అమ్మవారి విగ్రహాన్ని కదిలించడం వల్లే ఈ విపత్తు జరిగిందని భావించి అమ్మవారి విగ్రహాన్ని యథాస్థానంలోకి చేర్చారు. దాంతో ప్లేగు వ్యాధి తగ్గి జనం స్వస్థత చెంది ఇదంతా అమ్మవారి మహాత్మ్యం వల్ల జరిగిందన్న ప్రగాఢ విశ్వాసం ప్రబలింది. అప్పటి నుంచి ప్రజలు అమ్మవారికి ఇతోధికంగా పూజలు చేయడం ప్రారంభించారు. కాగా, ఈ గుడికి పైకప్పు కట్టడానికి జరిగిన ప్రయత్నాలు సఫలం కాలేదు. అంటే అమ్మకు అది ఇష్టం లేదని గ్రహించి ఆ తర్వాత ఆ ప్రయత్నాలను విరమించారు. అమ్మ సకల జనులకు అందు బాటులో ఉంటుంది. కనుకనే పూజలు చేసుకోవడానికి వచ్చిన భక్తులు ఎవరికి వారే అమ్మవారికి పసుపు, కుంకుమలతో పూజలు చేసి, కొబ్బరికా

# రైలుపట్టాలపై రీల్స్ చేస్తూ.. ప్రమాదంలో మృతి

లక్నో, సోషల్ మీడియాలో వైరల్ అయ్యే ప్రయత్నాలు చేస్తూ చాలా మంది తమ విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. తాజాగా రీల్స్ చేస్తూ ఓ కుటుంబం మొత్తం ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకుంది. రైలు పట్టాలపై రీల్స్ వేసేందుకు ప్రయత్నించి ప్రమాద వశాత్తు జరిగిన ప్రమాదంలో ఆ కుటుంబం ప్రాణాలు కోల్పోయింది. భార్యాభర్తలతో పాటు వారి మూడేళ్ల కొడుకు కూడా చనిపోయాడు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని సీతాపూర్ జిల్లా లహర్‌పూర్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ (26), నజీన్ (24) భార్యాభర్తలు. వీరికి అబ్దుల్లా అనే మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. లఖింపూర్ ఖిరి జిల్లాలోని హర్‌గావ్ సమీపంలోని క్యోతి అనే గ్రామంలో జరిగిన శుభ కార్యక్రమానికి అహ్మద్ తన భార్య , కొడుకుతో కలిసి హాజరయ్యారు. బుధవారం ఉదయం ముగ్గురు సమీపంలోని రైలు పట్టాలపైకి వచ్చారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేయడం వారికి అలవాటు. ఇంటి సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్దకు ముగ్గురు బైక్‌పై వచ్చారు. ఆ తర్వాత అహ్మద్, నజీన్, అబ్దుల్లా ట్రాక్స్‌పైకి వచ్చి రీల్స్ చేశారు. రీళ్ల లోకంలో మునిగితేలుతున్న వారు తమ వెనుకే రైలు వస్తున్నట్లు గమనించలేదు. రీల్స్ చేస్తున్న వారిలో ముగ్గురిని లక్నో నుంచి మైలాన్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. వేగంతో రైలు ఢీకొనడంతో ముగ్గురు రైలు పట్టాలపైనే మృతి చెందారు. వారి శరీరాలు ఛిద్రమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించారు. పక్కనే సెల్ ఫోన్ కనిపించింది. ఫోటోలు, ఇన్‌స్టాగ్రామ్ వీడియోలు తీస్తుండగా ప్రమాదం జరిగినట్లు నిర్ధారించారు. అనంతరం పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మందుబాబులకు పండుగే

న్యూఢిల్లీ,చేతిలో పైసా లేదు. అప్పులు దొరకవు. పాత అప్పుల వడ్డీలకే సంపాదన సరి. ఇదీ ఏపీ సర్కారు దైన్య స్థితి. ఉద్యోగులకు జీతాలివ్వాలి. పెన్షన్లు ఇవ్వాలి. సూపర్ సిక్స్ కు సూపర్ పొటాషే బలం. ఇక ఉన్నది ఒకటే దారి. ట్యాక్స్ పెయిర్సే ఆపద్బంధావులు. మందుబాబులే లేకుంటే పరిపాలనే ఉండదంటే ఆశ్చర్యం కాదు. ఇదే పచ్చి నిజం. ఇప్పటికే గత ప్రభుత్వం పుణ్యమా? అని చీప్ లిక్కర్‌నే స్కాచ్ ధరకు అంటగట్టారు. అందినంత పిండుకున్నారు. మద్యం పుత్రులు మాత్రం అనారోగ్యంతో బక్కచిక్కిపోయారు. ఆడోళ్ల పసుపు తాళ్లు తెగాయి. ఇక తాజా ప్రభుత్వమూ తాగనోడెందుకు ఈ లోకంలో అనే రీతిలో.. మద్యం ఆదాయం కోసం కొత్త తాయిలాలను రెడీ చేస్తోంది. కారు చౌక.. నాణ్యమైన లిక్కరు నినాదంతో ఏపీలో కొత్త మద్యం పాలసీ తెరమీదకు వస్తోంది. దీనికి కారణం.. తక్షణమే గల్లాపెట్టె నిండాలి.ఏపీలో కొత్త మద్యం పాలసీ కసరత్తులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్నికల్లో లిక్కర్ ధీరులను ఆకట్టుకునే రీతిలో ఇచ్చిన హామీలను నెరవేర్చి.. ప్రభుత్వ ఖజానాను నింపే క్రతువును ప్రారంభించింది. మరో ఇరవై రోజుల్లో .. మన మందు బాబులు ఇష్టమైన బ్రాండ్ల బ్రాందీ, విస్కీ, రమ్మును గటగటా గుటకేసే రీతిలో కొత్త పాలసీ దాదాపు ఖరారైంది. మద్యం ప్రియులకు అత్యంత ప్రీతిపాత్రమైన బ్రాండెడ్ కంపెనీల లిక్కర్ ను అందుబాటులోకి ప్రభుత్వం తీసుకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులతోనూ చర్చలు జరిగాయి. ధరల పైన.. కొత్త ఫార్ములా పైన నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో మద్యం దుకాణాలను ప్రయివేటు వ్యక్తులకే అప్పగించనుంది.

లిక్కరే ఖజానాకు ఆధారం

సంపద సృష్టికి ఉత్పత్తే ఆధారం. ఉత్పత్తికి పెట్టుబడి, శ్రమే మూలం. ప్రస్తుతం ప్రభుత్వం ఏకైక ఎజెండా సంపద సృష్టి. జనానికి పంపిణీ. కానీ ఇక్కడ పెట్టుబడి లేదు. ఏం చేయాలి? ఖజానా నింపటానికి ఏకైక మార్గం లిక్కర్ వ్యాపారం. ఈ వ్యాపారాన్ని గత ప్రభుత్వం నేరుగా నిర్వహించింది. 2019 -20లో రూ.17,473.25 కోట్ల లిక్కర్ ఆదాయాన్ని 2022-23 నాటికి రూ.23,785.32 కోట్లకు పెంచింది. 2023..24 నాటికి ఈ ఆదాయం రూ.26 వేల కోట్లకు చేరిందని అనధికార సమాచారం. 2019-20లో రూ.17,4 73.25 కోట్ల లిక్కర్ ఆదాయం 2020 -21లో రూ.17,890.01 కోట్లకు పెరిగింది. ఈ వ్యత్యాసం చాలా స్వల్పమే. కానీ.. 2021-22 ఆర్థిక సంవత్సరంలో, ఎక్సైజ్ ఆదాయం రూ. 21,432.31 కోట్లకు పెరిగింది . 2022 -23లో రూ. 23,785.32 కోట్లకు చేరుకుంది. అంటే ఎక్సైజ్ ఆదాయం పెరగబట్టే అత్యవసర ఖర్చులకు ప్రభుత్వం వినియోగించింది. ఇక తాజా ప్రభుత్వం పరిస్థితి తట్టుకోలేనిది. ఇటు సూపర్ సిక్స్ పథకాల కోసం రీ షెడ్యూల్ పేరుతో మళ్లీ అప్పుల కోసం తిప్పలు పడుతుంటే.. ఇక ఏకంగా ప్రకృతి విరుచుకుపడింది. ఈ పేరుతో సూపర్ సిక్స్ కు సెలవు ఇద్దామను కుంటే.. వరద బాధితులకు పరిహారం చెల్లించాలి. కేంద్రం ఇచ్చే నిధులతో గట్టెక్కుదామనుకుంటే%–% ఎంత వరకు సాధ్యమో అర్థం కాని స్థితి.

మద్యం పాలసీతోనే ఉపశమనం

అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలు దిశగా అడుగులు పడుతున్నాయి. అక్టోబర్ 3 నుంచి వైన్ షాపులు, బార్లల్లో సరికొత్త సంబరాలు జరగనున్నాయి. ఫ్రీ టచ్చింగ్%–% వన్ ప్లస్ త్రీ ఆఫర్లు రానున్నాయి. ఇప్పటికే ఈ పాలసీ రూపకల్పనకు అన్ని అంశాలను ప్రభుత్వం సమగ్రంగా అధ్యయనం చేసింది. ఇతర రాష్ట్రాల్లో మద్యం పాలసీలు ఏ విధంగా ఉన్నాయి.. ఆ పాలసీ వల్ల ఎదురయ్యే సమస్యలు ఏమిటి.. ప్రయోజనాలు ఏమిటి.. ఇలా అన్నింటిపైనా ఫోకస్ పెట్టింది. ఇకపై కొత్త ఎక్సైజ్ విధానంలో ప్రయివేటు వ్యక్తులకు పాత పద్ధతి వేలంలోనే మద్యం దుకాణాలను అప్పగిస్తుంది. ఇప్పటికే పాలసీ పైన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ పలు అంశాలపై చర్చించింది.

కారు చౌకగా మేలిమి బ్రాండ్లు

ధరలు అమ్మకాలపై బ్రాంది, విస్కీ, బీరుల్లో పాత బ్రాండ్లను తిరిగి ఏపీలో విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. అన్ని నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటుంది. తక్కువ ధరకు మద్యం అమ్మకాలు చేయడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునేలా కొత్త ఎక్సైజ్ పాలసీలో కసరత్తును ప్రభుత్వం చేస్తున్నట్లు తెలిసింది. అయిదేళ్ల కాలంలో అందుబాటులో లేకుండా పోయిన ప్రముఖ బ్రాండ్ల మద్యం ఏపీలో తిరిగి అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో ఎంఎన్‌సీ బ్రాండ్లకు పర్మిషన్లు ఇవ్వాలని మంత్రివర్గం ఓ నిర్ణయానికి వచ్చింది. తక్కువ ధర కేటగిరిలో క్వార్టర్ బాటిల్‌ను రూ.80 నుంచి రూ.90 లకే అందించాలని ప్రణాళికలు రచిస్తోంది.

## తమిళనాడులో దుర్ఘటన

చెన్నై,లేడీస్ హాస్టల్‌లో గురువారం రెఫ్రిజిరేటర్ పేలి ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగిందని ఆ సమయంలో హాస్టల్ లోని వారు నిద్ర పోతున్నారని మధురై జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. సంగీత వెల్లడించారు. మృతులు పరిమళ, శరణ్య . మదుర సమాచార సాంకేతిక మంత్రి పి. త్యాగరాజన్ బాధితులకు ప్రత్యామ్నాయ వసతి కల్పించడంతో పాటు ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని చెప్పారు.

# బీజేపీ అధ్యక్ష పీఠాన్ని ఆశిస్తున్న వారికి హైకమాండ్ కఠిన పరీక్ష..!



హైదరాబాద్,తెలంగాణ బీజేపీ సారథిపై ఎంపికపై హైకమాండ్ ఓ చిత్రమైన పోటీ పెట్టిందట అధ్యక్ష పదవి ఆశిస్తున్న నేతల సామర్థ్యానికి పరీక్షగా చెబుతున్న ఈ పోటీ ఇప్పుడు కమలం పార్టీలో ఆసక్తికరంగా మారింది. అధిష్టానం వద్ద మార్కులు కొట్టేయాలనే ప్లాన్‌తో నేతలు పోటాపోటీగా ఆ పరీక్షలో నెగ్గేందుకు ప్రయత్నిస్తున్నారంటున్నారు. కమలం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారిన పోటీ ఏంటి?

కార్యకర్తల్లో బలం ఉన్న నేతకే పట్టం..

తెలంగాణపై భారీగా ఆశలు పెట్టుకున్న కమలం పార్టీ కొత్త అధ్యక్షుడిగా సరైన నేతను ఎంపిక చేయాలని చాలా కాలంగా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా పలువురు నేతల పేర్లను పరిశీలిస్తున్న బీజేపీ పెద్దలు కార్యకర్తల్లో బలం ఉన్న నేతకే పట్టం కట్టాలని నిర్ణయించుకున్నట్లు తాజా సమాచారం. ఇందులో భాగంగా పార్టీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న నేతలు అందరికీ పార్టీ సభ్యత్వ నమోదు పరీక్ష పెట్టినట్లు చెబుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణలో బలపడుతూ వస్తున్న బీజేపీ వచ్చే ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కార్యకర్తల బలం ఎక్కువగా ఉండాలని భావిస్తోంది. ఇందుకోసం గత ఎన్నికల్లో పోలైన 70 లక్షల ఓట్లను పార్టీ సభ్యత్వంగా నమోదు చేయించాలని ఆశిస్తోందంటున్నారు. ఈ టార్గెట్‌ను చేరుకోడానికి పార్టీ నేతలకు బాధ్యతలు అప్పగించినట్లు చెబుతున్నారు.

అధ్యక్ష పీఠాన్ని ఆశిస్తున్న ఆ నలుగురికీ పరీక్ష..

తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవిపై పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్‌తోపాటు మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు ఆశలు పెట్టుకున్నారు. ఈ ముగ్గురు ఎవరికి వారే తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ నేత ఈటల రాజేందర్ చాలాకాలంగా అధ్యక్ష పదవి ఇస్తారని ఎదురుచూస్తున్నారు. తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్‌కు తానే ప్రత్యామ్నాయ నేతగా ఎదగాలనే లక్ష్యంతో బీజేపీలో చేరిన ఈటల%% బీజేపీ సభ్యత్వం తీసుకున్న నాటి నుంచి అధ్యక్ష పదవిపైనే గురిపెట్టారు. పార్టీ కూడా ఆయనకు ఆ స్థాయి గౌరవమే ఇచ్చింది. కానీ, కాషాయ సిద్ధాంతాలను అనుసరించి ఇప్పటివరకు ఈటలకు అధ్యక్ష పదవిపై ఇవ్వకుండా నెట్టుకొచ్చింది. ఇక ఆయన పోటీగా మరో ఇద్దరు ఎంపీలు, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు అధ్యక్ష పీఠాన్ని ఆశిస్తుండటంతో పార్టీ ఈ నలుగురికి పరీక్ష పెట్టిందంటున్నారు.

యజ్ఞంలా పార్టీ సభ్యత్వ నమోదు..

రాష్ట్రంలో 70 లక్షల సభ్యత్వాలను చేరుకోవాలంటే ప్రతి బూత్‌లో కనీసం 200 మంది కార్యకర్తలను సంపాదించాలని భావిస్తోంది కమలం పార్టీ. దీంతో పార్టీ అగ్ర నేతలంతా రంగంలోకి దిగి పార్టీ సభ్యత్వ నమోదును ఓ యజ్ఞంలా చేస్తున్నారంటున్నారు. ఎంపీ ఈటలతోపాటు రఘునందన్‌రావు, అర్వింద్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావుతో పాటు మరికొందరు నేతలు ఎవరికివారుగా సభ్యత్వ నమోదును సవాల్‌గా తీసుకుని పనిచేస్తున్నారని చెబుతున్నారు. తమ నియోజకవర్గాలతోపాటు తమ అనుచరుల ద్వారా ఎక్కువ సభ్యత్వం చేయించి%% పార్టీ పెద్దల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. సభ్యత్వ నమోదు పూర్తయ్యాక పార్టీ జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోవడం బీజేపీ ఆనవాయితీ. ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్షులను నియమిస్తారు. ఇప్పుడు కూడా ఎక్కువ సభ్యత్వాలను నమోదు చేయించి జాతీయ పార్టీ నేతలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా రాష్ట్ర బీజేపీ నేతలు పావులు కదుపుతున్నారని చెబుతున్నారు. ఈ నెల 9న ప్రారంభమైన సభ్యత్వ నమోదు.. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చురుగ్గా సాగుతోందంటున్నారు. అధిష్టానం ప్రత్యేక టార్గెట్లు పెట్టడంతో ఎవరు ఎక్కువ సభ్యత్వాలు నమోదు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. మొత్తానికి కాబోయే బీజేపీ అధ్యక్షుడికి ముందుగానే కఠిన పరీక్ష పెట్టిందంటున్నారు. ప్రతి బూత్ స్థాయిలో 200 సభ్యత్వాలు నమోదు చేయడం కుదిరేపనేనా అని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఐతే పార్టీకి 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండటంతోపాటు క్రమంగా బలోపేతమవుతున్నామనే భావనతో నేతలు దూసుకుపోతున్నారు. మొత్తానికి ఈ పరీక్షలో ఎవరు విజయం సాధిస్తారనేది ఆసక్తి రేపుతోంది.

# మరోమారు పార్టీకి దూరంగా బాలినేని



ఒంగోలు,ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహారం ఆ పార్టీలో కాకరేపుతోంది. వైసీపీని వీడేందుకు ఆయన నిర్ణయించుకున్నారనే ఓ ప్రచారం వాడి వేడిగా నడుస్తుంది.అందులోభాగంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో ఒంగోలు నగర పాలక సంస్థకు చెందిన వైసీపీ కార్పొరేటర్లతో బాలినేని సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తన భవిష్యత్తు కార్యాచరణను కార్పొరేటర్లతోపాటు తన ముఖ్య అనుచరులకు ఈ సందర్భంగా బాలినేని వివరించారు. దీంతో బాలినేనితో రాయబారం నెరపడానికి మాజీ మంత్రి విడదల రజినీతోపాటు సతీష్ రెడ్డిని పార్టీ అధినేత వైఎస్ జగన్ రంగంలోకి దింపారు. దీంతో హైదరాబాద్‌లోని బాలినేని నివాసంలో ఆయనతో వారిద్దరు చర్చలు జరుపుతున్నారని సమాచారం. రోవైపు బుధవారం సాయంత్రం తాడేపల్లిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌తో బాలినేని శ్రీనివాసరెడ్డి సమావేశమైనట్లు ఓ ప్రచారం అయితే జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాలంటూ బాలినేనిని వైఎస్ జగన్ కోరగా.. అందుకు ఆయన తిరస్కరించినట్లు తెలుస్తుంది. ఈ సందర్భంగా పార్టీ అధికారంలో ఉండగా.. తనను పక్కన పెట్టిన తీరును పార్టీ అధినేత వైఎస్ జగన్ ముందు బాలినేని ఉంచినట్లు సమాచారం. గతంలో పక్కన పెట్టి.. పార్టీకి ప్రతిపక్ష హోదా సైతం దక్కించుకోలేని వేళ.. తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎలా అప్పగిస్తారంటూ తన అసంతృప్తిని మాజీ సీఎం వైఎస్ జగన్ ఎదుట బాలినేని వెళ్లగక్కినట్లు తెలుస్తుంది. పార్టీ వీడాలని తాను కృత నిశ్చయంతో ఉన్నట్లు ఈ భేటీలో వైఎస్ జగన్ ఎదుట బాలినేని కుండ బద్దలు కొట్టారని ఉమ్మడి ప్రకాశం జిల్లాలో జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో విడదల రజినీతోపాటు సతీష్ రెడ్డిని బాలినేనితో చర్చించేందుకు రాయబారానికి పంపినట్లు సమాచారం.

# అభివృద్ధికి ఆమడదూరంలో జ్ఞాన సరస్వతి ఆలయం



బాసర,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత యాదాద్రి, వేములవాడ ఆలయాలకు ఇచ్చిన ప్రాధాన్యం బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయానికి ఇవ్వడం లేదని భక్తులతోపాటు ఈ ప్రాంత ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో ప్రఖ్యాతి గాంచిన బాసర శ్రీజ్ఞానసరస్వతి ఆలయంపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి.భారత దేశంలో ఉన్న ప్రముఖ సరస్వతీ ఆలయాల్లో ఒకటి కాశ్మీర్‌లో ఉండగా, రెండోవది బాసరలోనే ఉంది. బాసరలో జ్ఞాన సరస్వతీ అమ్మవారు మహాలక్ష్మి, మహాకాళి సమేతులై కొలువుదీరి ఉన్నారు. ఈ ఆలయం చాళుక్యుల కాలంలో నిర్మించారు. అమ్మవారు దర్శనం కోసం దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత గల ఈ పురాతన ఆలయంపై నిర్లక్ష్యమెందుకో అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నిత్యం భక్తుల రద్దీ

బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మావారి ఆలయంలో నిత్యం భక్తులు రద్దీ ఉంటుంది. ఇక్కడ సరస్వతీ ఆలయంలో బాలబాలికలకు అక్షరాభ్యాసం చేయడానికి దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. తెలంగాణ, ఆంధ్ర నుంచే కాకుండా దేశ నలుమూల నుంచి కూడా భక్తులు ఇక్కడకు వస్తారు. కొందరు భక్తులు రాత్రి వేళ ఇక్కడ ఉండి తెల్లవారు జామున జరిగే పూజ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వసంత పంచమి, దసరా రోజుల్లో వేలాది మంది భక్తులు ఇక్కడ అమ్మవారిని దర్శించుకుంటారు. అలాంటి రోజుల్లో సుమారు ఆరేడు గంటలు క్యూలో ఉంటూ అమ్మవారిని దర్శించుకుంటుంటారు.

తెలంగాణ ఏర్పడి పదేళ్లు దాటినా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బాసర ఆలయానికి పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు దాటినా బాసర క్షేత్రం ఆలయ అభివృద్ధి మాత్రం గడపదాటలేదు. దేవాలయ అభివృద్ధికి 2018 తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో 50 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం కేటాయించింది. అయితే ఆ నిధులు మాత్రం విడుదల కాలేదు. దీంతో ఆలయ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంది.

వర్షం వస్తే

ఏమాత్రం వర్షం పడినా అమ్మవారి సన్నిధిలోని గర్భాలయంలో లీకేజీలు ద్వారా నీరు కిందకు పడుతుంది. ఏకధాటిగా వర్షాలు కురిస్తే చెరువుగా మారుతుంది. గర్భాలయంలో భక్తులపై నీరు పడకుండా ఆలయ అధికారులు టబ్బులను ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాకార మండపం సైతం వర్షాలకు శ్లాబ్ నుంచి కూడా నీరు లీకేజీ ఉంటుంది. గత ప్రభుత్వం ఆలయ ప్రాంగణంలో సుమారు రూ.8 కోట్లతో రెండు తాత్కాలిక షెడ్డులను నిర్మించారు. ఆలయ వసతి భవనాలపై ఏసీ వసతి భవనలు కూడా నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన 50 కోట్ల నిధులను విడుదల చేస్తే ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం అయ్యేవి.

భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలి

భక్తుల రద్దీకి అనుగుణంగా మండపాలు, క్యూ కాంప్లెక్స్ లేక పోవడంతో భక్తులు చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఆలయ క్యూలైన్‌లో మరుగుదొడ్లు లేక మహిళ భక్తులు, వృద్ధులు అవస్థలు పడుతున్నారు. వసంత పంచమి, దసరా రోజుల్లో సుమారు ఏడు గంటల క్యూలైన్‌లో భక్తులు వేచి ఉండాల్సి ఉంటుంది. మరుగుదొడ్లు లేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. క్యూలైన్‌లో మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. అమ్మవారి సన్నిధిలో విశాలమైన ప్రత్యేక అక్షరాభ్యాస మండపలు, క్యూ కాంప్లెక్స్, గర్భాలయం వెడల్పు, కుంకుమార్చన మండపం ఏర్పాటు అయితే వేల సంఖ్యలో వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలగుతాయి. ఇందుకు కావలసిన ఆలయ భూమి కూడా అందుబాటులో ఉంది. కానీ నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు.

## 33 వేల ఇళ్లు, 36 వేల ద్విచక్రవాహనాలు ధ్వంసం

విజయవాడ, మూడు డివిజన్ల పరిధిలోని 10 వీధుల్లో ఇంకా వరద నీరు ఉందని మంత్రి నారాయణ తెలిపారు. వరదల వల్ల 33 వేల ఇళ్లు, 36 వేల ద్విచక్రవాహనాలు పాడయ్యాయని చెప్పారు. వరద బాధితుల సహాయం కోసం బ్యాంకర్లు, బీమా కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు, మంత్రులు భేటీ అయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

# 16 మంది ఎమ్మెల్యేలను మలుపుకోవడం ఎలా ?



హైదరాబాద్,తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుండి 26 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని, బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకుని ప్రతిపక్ష పార్టీ లేకుండా చేసుకోవాలన్న పట్టుదలతో సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ ఆకర్ష్ ప్రారంభించాడు. లోక్ సభ ఎన్నికలకు ముందు, ఎన్నికల తరువాత మొత్తంగా 10 మంది ఎమ్మెల్యేలను ఆకర్షించగలిగారు.ఈ నేపథ్యంలోనే పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల క్రిష్ణమోహన్ రెడ్డి యూటర్న్ తీసుకోగా ఆయనను మళ్లీ పార్టీలోకి తీసుకువచ్చారు. మరో 16 మంది ఎమ్మెల్యేలను మాత్రం కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే ప్రయత్నాలు ఫలించడం లేదు. పార్టీలో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి క్యాబినెట్ హోదాతో వ్యవసాయ సలహాదారు పదవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్ కు డెయిరీ డెవలప్ మెంట్ ఫెడరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు.పీఏసీ చైర్మన్ పదవి పార్టీ మారిన అరికెపూడి గాంధీకి ఇవ్వడం వివాదానికి దారితీసింది. ఈ పరిస్థితులలోనే పార్టీ మారిన ముగ్గురు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుల అనర్హత పిటీషన్లను నాలుగు వారాలలో తేల్చాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఒక వేళ నిర్ణయం తీసుకోకుంటే తామే సుమోటోగా మరోసారి విచారిస్తామని వెల్లడించింది.దీంతో అక్టోబర్ 9వ తేదీలోగా 16 మంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ లో చేర్చుకుంటే అప్పుడు బీఆర్ఎస్ ఎల్పీ విలీనం అవుతుంది. లేదంటే పార్టీలో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు డేంజర్ బెల్స్ మోగినట్లే. మొదట ముగ్గురు ఎమ్మెల్యేల మీద అనర్హత వేటు కాస్తా అటూ ఇటూ ఖాయం అనే చెప్పాలి. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలోనే మరో 16 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకునే అంశం మీద కాంగ్రెస్ అధిష్టానంతో చర్చించేందుకు సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనకు వెళ్లాడు. పార్టీ ఫిరాయింపుల మీద దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలు చెబుతున్న నేపథ్యంలో తెలంగాణలో జరుగుతున్న పరిణామాలు ఆ పార్టీకి ఇరకాటంగా మారాయి. అందుకే తెలంగాణలో ఈ చేరికలను తొందరగా ముగించి ఈ చర్చకు ఫుల్ స్టాప్ పెట్టాలని కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ మీద వత్తిడి తెస్తున్నట్లు తెలుస్తుంది. అందుకే మరో 16 మందిని వీలయినంత తొందరలో చేర్చుకోవాలని రేవంత్ పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తుంది.

# 25వేలమంది పోలీసులతో నిమజ్జన బందోబస్తు



హైదరాబాద్,నగరంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా 25వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఖైరతాబాద్ మహాగణపతిని మధ్యాహ్నం 1.30 గంటల్లోపు నిమజ్జనం చేసేలా నిర్వాహకులతో చర్చించామని.. దానికి వాళ్లు అంగీకరించారని తెలిపారు. నగర వ్యాప్తంగా అన్ని రకాల విగ్రహాలు కలిపి సుమారు లక్ష వరకు ఉండొచ్చన్నారు. 17న వేల సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నాయన్నారు. తిలకించేందుకు పెద్ద ఎత్తున నగరవాసులు హుస్సేన్‌సాగర్ పరిసరాలకు వస్తారని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని సీపీ వివరించారు. ఇకపోతే గణేశ్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఇప్పటికే అనేక వినాయక విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. ఈనెల 17న ఖైరతాబాద్ మహాగణపతితో పాటు పెద్ద సంఖ్యలో వినాయాక విగ్రహాలు నిమజ్జనాలు జరుగనున్నాయి. ఇందుకోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సందర్భంగా గణేశ్ నిమజ్జనం ఏర్పాట్లపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ... గణేశ్ నిమజ్జనానికి 25 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో గణేశ్ నిమజ్జనం జరుగుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఖైరతాబాద్ గణేశ్ నిమజ్జనం మధ్యాహ్నం 1:30 గంటలలోపు పూర్తి అవుతుందని తెలిపారు. ఈ ఏడాది అదనంగా 10 శాతం వినాయక విగ్రహాలు ఏర్పాటు అయ్యాయన్నారు. అన్నిరకాల విగ్రహాలు కలిపి దాదాపు లక్ష వరకు ఉండొచ్చన్నారు. నాలుగు రోజులుగా హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జనాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 17న వేల సంఖ్యలో వినాయక విగ్రహాల నిమజ్జనం అవుతాయని సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్రల నేపథ్యంలో హైదరాబాద్ సిటీ పోలీసులు శుక్రవారం కీలక నిబంధనలు ప్రకటించారు. నిమజ్జనం రోజున పాటించాల్సిన ముందస్తు నియమాలను వెల్లడించారు. గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు విగ్రహాలను తీసుకెళ్లడానికి అవసరమైన వాహనాన్ని ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున సౌత్ జోన్ పరిధుల నుంచి విగ్రహాలను తీసుకెళ్లేవారు ముందుగానే బయలుదేరాలని, వాహానానికి ఏసీపీ కేటాయించిన నంబర్‌ను ప్రదర్శించాలని తెలిపారు. ఇకపోతే ఒక గణేశ్ విగ్రహానికి ఒక వాహనం మాత్రమే అనుమతి ఉంటుంది.విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంపై లౌడ్ స్పీకర్‌ను అమర్చకూడదు. నిమజ్జనం రోజు వాహనాలపై డీజేతో కూడిన మ్యూజికల్ సిస్టమ్‌కు అనుమతి లేదు. రంగులు చల్లుకునేందుకు కాన్ఫెట్టి తుపాకులను ఉపయోగించకూడదు. విగ్రహాన్ని తీసుకెళ్లే వాహనంలో మద్యం లేదా మరేదైనా మత్తుమందులు సేవించిన వ్యక్తులకు అనుమతి ఉండదు.రోడ్డుపై వాహనం వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌ను ప్రభావితం చేయకూడదు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించకూడదువిగ్రహాన్ని తీసుకెళ్లే వాహనం ఇతర వాహనాలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా మార్గంలో ఆపకూడదు. అప్పటి పరిస్థితులను బట్టి పోలీసు అధికారులు ఇచ్చే ఆదేశాల మేరకు వాహనాల కదలికలు ఆధారపడి ఉంటాయి.ఊరేగింపులో ఎవరూ కర్రలు/కత్తులు, కాల్పులు ఆయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు. జెండాలు లేదా అలంకారాల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల కంటే ఎక్కువ పొడవు ఉండకూడదు. వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్‌లను బాటసారులపై వేయకూడదు. ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/రెచ్చగొట్టే ప్రసంగాలు/నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించకూడదు. జనాలలో ఏ వర్గానికి చెందిన వారి మనోభావాలను దెబ్బతీసే ఇతర రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.ఊరేగింపు సమయంలో బాణాసంచా ఉపయోగించకూడదు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించాలి. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే 100కి డయల్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

# తెలంగాణకు వరద సాయం.. నోరు మెదపని కేంద్రం!

న్యూఢిల్లీ,వరదలు మిగిల్చిన నష్టం నుంచి తెలంగాణ ఇప్పుడప్పుడే కోలుకునేలా కనిపించడం లేదు. కేంద్ర పెద్దలెవరూ సాయం పై నోరు మెదపడం లేదు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు గెలిచారు. అందులో ఇద్దరు మంత్రులు కూడా ఉన్నారు. కానీ తెలంగాణకు ఒరిగిందేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు కొట్టిన డైలాగులు ఎక్కడికి పోయాయో.. ఎవరికీ అర్థం కావడం లేదని అంటున్నారు.అన్నింటికీ మించి తెలంగాణ ఎంపీలకు కేంద్ర మంత్రి పదవులు వచ్చాయి. ఇక వీరందరూ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. వీరితో పాటు బీజేపీ ఎంపీల బృందాలు పర్యటించాయి. ఖమ్మం జిల్లాలో వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పర్యటించి.. రాకాసితండాలో వరద బాధితులను పరామర్శించారు. బాధితులకు అండగా కేంద్ర ప్రభుత్వం ఉంటుందని అభయమిచ్చారు.ముందుగా.. పంట పొలాల్లో ఇసుక మేటను తొలగిస్తామని హామీ ఇచ్చారు. అందుకు తగిన ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతే ఇక్కడితో డ్రామా అయిపోయిందని అంటున్నారు. వచ్చారు.. చూశారు.. వెళ్లారు. అనే కాన్సెప్ట్ లోనే నడిచిందని అంటున్నారు. కనీసం వీరెవరూ కూడా కేంద్ర పెద్దలతో మాట్లాడి నిధులు రప్పించే ప్రయత్నాలు చేయడం లేదనే తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.వరదల కారణంగా తెలంగాణకు రూ.5,348 కోట్ల మేర నష్టం జరిగిందని సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి ఓపెన్ గా ప్రకటించారు. అంతేకాదు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో జరిగిన సమావేశంలో కూడా ఇదే మాట తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆపదలో ఉన్న ప్రజలకు సాయం చేస్తామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. కట్ చేస్తే.. ఫలితం శూన్యం. ఆయన హైదరాబాద్ నుంచి ఫ్లయిట్ ఎక్కి, అన్నీ ఇక్కడే మరిచిపోయారని, ఢిల్లీ వరకు తీసుకెళ్లలేదని అంటున్నారు.గతంలో కూడా తెలంగాణకు భారీ వరదలు వచ్చాయి. అప్పుడు హైదరాబాద్ లో కురిసిన భారీ వర్షాలకు కేంద్రం నుంచి ఆశించిన సాయం అందలేదు. అదే గుజరాత్ లో జరిగితే మాత్రం పరిగెత్తుకుంటూ వెళ్లి, కోట్ల రూపాయలు కుమ్మరిస్తారని అంటున్నారు. అక్కడ వారే ప్రజలు, ఇక్కడి వారు కారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం వరదలకు తెలంగాణలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం కలిగింది. ఎంతోమంది పేదలు నిరాశ్రయులయ్యారు. వారందరికీ పునరావాసం




కల్పించాల్సి ఉంది. ఇవన్నీ జరగాలంటే కేంద్రం ఏదో మొక్కుబడి తంతుగా విదిలిస్తే సరిపోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.పక్కనే ఉన్న మరో తెలుగురాష్ట్రం ఏపీకి ఎక్కువ నిధులిచ్చి, తెలంగాణకు తక్కువ ఇచ్చినా ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. ఇలా చేస్తే.. తెలంగాణ ప్రజల్లో బీజేపీ పట్ల వ్యతిరేకత మరింత పెరుగుతుందని, ఇది వారికే నష్టమని సీనియర్ రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అన్నింటికీ మించి గొప్ప విషయం ఏమిటంటే.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజాక్షేమం కోసం ఒక మెట్టు దిగి పార్టీలు వేరేనా ప్రజల కోసం పార్టీలకతీతంగా పనిచేద్దామని ముందడుగు వేయడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది.

## టీచర్లకు హెల్త్ కార్డులు అందచేస్తాం: దామోదర

సంగారెడ్డి, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సమాజ నిర్మాణం బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోలు నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందోలు నియోజకవర్గం ఎడ్యుకేషనల్ హబ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ ద్వారా 6,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేస్తామని చెప్పారు. ఉద్యోగుల డీఏలు విడుదల చేయాలనే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com